# సమరం సంధి శాంతి



స్వాతి

'అమ్మగారో! అమ్మగారో!'

పాలవాడు కోడికంటే గట్టిగా కూసి, రెండి ళ్ళనీ నిద్ర లేపాడు. సత్యవతి–మొగుడు చీరె పట్టుకుని లాగుతూంటే, 'వేళాపాళా లేకుండా సరసాలాడుతూ కూచుంటే అయినట్లే' అని చీరను మొగుడి చేతుల్లోంచి ఒక్క లాగు లాగి, తొందరగా చుట్టబెట్టుకుని, గిన్నె పట్టుకు వెళ్ళిం దవతలికి.

పక్కింటి వరలక్ష్మికి నిద్రలో ఎవరో పిలిచి నట్టవుతూంటే 'వూ వూ' అంటూ దొర్లుతూ, మొగుడొక్క చరుపు నడుం మీద చరచగానే (కోపంతో కాదుస్మండీ) ఉలిక్కిపడిలేచి, పాలవాడి మీద అష్టోత్తరం చదువుతూ నడిచింది.

పాలవాడు తాపీగా గేదె నోటి ముందు గడ్డి పరకలు విప్పి, పడవేస్తున్నాడు. 'నీ నోట్లో గడ్డి పెట్టా! వెధవా!' అనుకుని, 'ఇంకా ఆల్లేదు, చూల్లేదు....కొంప మునిగి పోయినట్లు అరి చావేం?'' అంది వరలక్ష్మి ఒళ్ళు మంటతో, కాస్త కళ్ళ మంటతో.

'ఏమంటారమ్మా? అయితే? గడ్డెట్టకండా గేదె పాలిత్తాదేటమ్మా?' వాడు భోయ్యిమన్నాడు రేచుకుక్కలాగా.

'అమ్మ నీ గొంతుకొయ్యా! బలమంతా దేవుడు నీ గొంతుకలోనే పెట్టినట్టున్నాడు' అను కుని, 'ఇదిగో! తొందరగా పాలు తీసి కేకెయ్యి!' అంది వరలక్ష్మి గిన్నె అక్కడ ఉంచుతూ.

సత్యవతి అట్నించి 'నా కవతల బోల్డు పన్లున్నాయి. ముందిలా పోసిపో!' అంది.

వరలక్ష్మి చురచుర చూసిందట.

'ఎవరికి తేనేంటమ్మా? ఇద్దరి కిచ్చేదీ పాలే గందా?' అన్నాడు పాలవాడు నవ్వుతూ.

'నీ ఎత్తులు నా దగ్గిరెయ్యకు! నీకు మనిషికో పద్ధతి చూపించే బుద్ధి వుంది గనకనే అంటు న్నాను!'

ఆ మాటతో వరలక్ష్మికి అగ్గి. వెళ్ళి ఎక్కడంటుకోవాలో అక్కడ అంటుకుంది.

'మాకేఁవిటమ్మా ఎక్కువ పోసేస్తున్నాడు?'

'ఎక్కువ పోసేడని నే నన్నానా? వాడి బుద్ధి చెప్తున్నాను గాని....ఏవయ్యా మొన్నను ఆ వేళకి నీకు నీళ్ళెక్కణ్ణించి వొచ్చేయి? డబ్బులు డబ్బుల్లా ఇచ్చేయ్యాలీ .... డబ్బుల్లో మేం ఏం కలుపుతున్నాం?'

'మాకేం బంగారు పాలు పోసేస్తున్నావటయ్యా, నువ్వు?'

పాలవాడు పాలుతీసిముందు సత్యవతి గిన్నెలో పోశాడు. వరలక్ష్మి గిన్నెలో పోస్తూంటే 'సరిగ్గా కొలిచి పొయ్యి! మేఁ వేదో బంగారు పాలు పోయించేసుకుంటున్నామని ఏడుపు!' అంటూ గిన్నె తీసుకుని, తలుపులు ధభాల్న వేసి ఇంట్లో కెళ్ళింది.

పొయ్యి వెలిగించి, పాలు మరగ బెడుతూంటే కుళాయి పడుతూన్న శబ్దం వినిపించింది. 'వేగిరం పట్టుకోకపోతే అయింతా అరగంటలో కట్టేస్తాడా చచ్చినాడు' అంటూ లేచి, రెండుబిందెలు పట్టుకుని, మొగుడికి 'ఇదిగో! మీరిలా వొచ్చి పాలు చూడండి' అని పురమాయించి వెళ్ళింది వరలక్ష్మి.

రెండు వాటాలకూ మధ్య ఒకటే కుళాయి వుంది. సత్యవతి బిందె అప్పటికే సగం నిండి పోయింది. 'ఆహా! అప్పుడే తయారు ఇక్కడానూ!' అనుకుని. 'మీ బిందె నిండాక కాస్త వదలండి! మళ్ళా కట్టేస్తాడో! ఏఁవిటో!' అంది.

'రెండు బిందెలేనా తీసుకోనీండి! మా కివాళ అస్సలు నీళ్ళు లేవు.'

'మాకొహటి వుంది చచ్చేయా? అద్దెంతా వాడికి పుట్ట మీద పెట్టినట్టు ఇచ్చెయ్యడఁవూను! పదేపాట్లు పడ్డఁవూ! మరో కుళాయి వేయించ మంటే వినిపించుకోడు!'

సత్యవతి రెండో బిందె కుళాయికింద పెట్టింది.

'నన్ను పట్టుకోనీండమ్మా! అవతల లింకా పనుంది!'

'ఆగండమ్మా! రెండు బిందెలేనా....నీళ్ళస్సల్లేవు.'

'అలా అంటే ఎలా? ఓ బిందె పట్టుకున్నారు గదా?'

'ఆగండి! అలా మీద పెట్టేయకండి.'

'బావుందండీ మీ వరసా! ఉన్న నీళ్ళన్నీ మీరే పట్టుకుంటే మేమేం అవుతాం?'

'అన్యాయంగా మాట్లాడకండి! ఉన్న నీళ్లన్నీ నేనే పట్టేసుకుంటున్నానా?'

'కాకపోతే? కుళాయి విప్పిం దగ్గర్నుంచి....'

'రెండు బిందె త్తైదాన్నో లేదో అలా విసుక్కుపోతారేమిటి?'

'ఇప్పుడు రెండు....తర్వాత మరో రెండు.... ఆ తర్వాతింకో రెండు.'

'అయితే అన్నీ నేనే మోసుకు....'

'అనడం ఒక్కటే గదా నాకు మిగిలింది?'

ఇలా వరలక్ష్మి. సత్యవతీ మాటా మాటా అనుకుంటూ ఉండగా పనిమనిషి బంగారమ్మ హఠాత్తుగా వచ్చేసి, ఖణేల్మని కేక పెట్టింది.

'అమ్మా! అమ్మోయ్!'

'బంగారొచ్చి కూచుందప్పుడే నా పీక మీదికి! నీ పుట్టిం మునిగిపోలేదు గాని .... ఉండవే! వస్తున్నా!'

'ఎంత సేపమ్మా ఇట్టా అరిసేది? సరే! మీరు నీళ్ళట్టుకోండి! సత్యవతమ్మగారింట్లో తోఁవేసి వొస్తాను.'

'ఆగవే! అక్కడంటుకుంటే ఒకంతటా ఊడిపడవు!' వరలక్ష్మి అక్కను వెళ్ళగక్కింది.

సత్యవతి బంగారిని కేకేసింది. 'ఇక్కడ తోఁవేసి పోదూ? నువ్వు నాకేదో తవ్వి తల కెత్తేస్తున్నట్టు ఆవిడ అలా గుంజుకుపోతుం దేఁవిటి?'


'ఒసే! బంగారీ! ముందిలా వొస్తావా రావా?'

'వెళ్ళు! వెళ్ళు! మళ్ళా అరిచ్చచ్చినా కాఫీ చుక్క పొయ్యను! తిండి దండగే నాకు!' అంది సత్యవతి.

'నాకేఁవిటి చేసేస్తున్నావే నువ్వు? నాకేం బట్టలు ఝాడిస్తున్నావా? నీళ్ళు పడుతున్నావా? బజారు పని చేస్తున్నావా?'

'ఉత్తనే అవన్నీ చేసేదానికదేం వెర్రిదికాదు! నెత్తి మొత్తీ పుచ్చుకుంటుంది. ......!'


నీళ్ళింట్లోకి చేరవేసి, బంగారికి అంట్లు పడేసి, దాన్ని పంపి, స్నానం చేసి, వండే సరికి పద యింది. భర్త గబగబ అన్నం తిని ఆఫీసుకు వెళ్ళిపోయాడు. బాబిగాడికి అన్నం పెట్టి తనూ తిని లేచింది వరలక్ష్మి. ఎండ అవతల మండిపోతూంది! నిద్ర పోదామని ఫాను వేస్తే అది తిరగనంది. పాటలు కూడా పెట్టుకుందుకు వీల్లేదు కాబోలని ఎలెక్ట్రిసిటీ వాళ్ళని తిట్టుకుంది. టేబిలుమీద పత్రిక తీసి తిరగేసింది. 'అయిపోయిందిగా! చదవడం? ఇచ్చేస్తే సరి' వరండాలో మూడు చక్రాల సైకిలు తొక్కుతూన్న బాబిగాణ్ణి పిలిచి 'ఈ పుస్తకం ఇచ్చేసి రామ్మా' అంది. బాబిగాడు వెళ్ళబోతూంటే 'ఒరే! ఇలా రా!' అని పిలిచింది.



* తడిగా ఉన్న కాఫీ ఫిల్టరులో కాఫీ పొడి వేస్తే, డికాషన్ సరిగా దిగదు. ఫిల్టరులో పొడివేసే ముందు, ఫిల్టరును కాస్త వేడిచేసి, ఆ తర్వాత అందులో కాఫీ పొడివేసి, నీరు పోస్తే డికాషన్ బాగా దిగుతుంది.

* కాఫీ డికాషన్ ఎప్పుడైనా మిగిలిపోతే, పార బొయ్యనవసరంలేదు. ఆ డికాషనులో రెండు చెమ్చాల చక్కెరవేసి ఉంచి, మర్నాడు ఉపయోగిస్తే కాఫీ బాగానే ఉంటుంది! కాకపోతే, కొద్దిగానే వేడి చెయ్యాలి గాని, మళ్ళీ మరిగించకూడదు.






సాధారణంగా మన అజాగ్రత్తవల్ల కొన్ని, కొన్ని సమయాల్లో జాగ్రత్తగా వున్నప్పటికీ చీరలకు మరకలు అవుతూ వుంటాయి.

పట్టుచీరలకు మరకలు పడినట్లయితే, వాటి మెరుపు కూడా తగ్గిపోతుంది. వాటిని సరైన పద్ధతిలో తొలగించనట్లయితే బట్టలు చిరిగిపోయే అవకాశం కూడా వుంది. ముఖ్యంగా — మరక పడిన వెంటనే దానిని తొలగించటం మంచిది.

బట్ట చెడకుండా మరకలను తొలగించడానికి యీ క్రింది పద్ధతులు వుపయోగించవచ్చు.

**పసుపు మరక :**

మరకపడిన భాగాన్ని మొదట స్పిరుటులో ముంచి ఆరవేసి, తరువాత సోప్‌తో రుద్దాలి.

**తుప్పు మరక :**

మరక పడిన భాగాన్ని నిమ్మకాయ రసంలో ముంచి, దానిపై వుప్పు చల్లి ఎండలో ఆర బెట్టాలి. కొద్దిసేపటి తరువాత సోప్పుతో వాష్ చేస్తే మరక పోతుంది.

**గ్రీజు లేక ఆయిలు మరక :**

వేడి నీటిని వుపయోగించి సోపుతో రుద్దితే, మరక పోతుంది. మరకపడి ఎక్కువ కాలం అయిపోతే బెంజైన్ వుపయోగించాలి. మరక అడుగున బ్లాటింగ్ పేపరు (అద్దుడు కాగితం) వుంచి ఇస్త్రీ చేసినా కూడా యీ మరకలు పోతాయి.

**పెయింటు మరక :**

మరక బాగా దళసరిగా పడితే నెమ్మదిగా కత్తితో తీసి వేసి ఆ భాగాన్ని టర్పన్‌టైన్‌లో ముంచి ఆరిన తరువాత వాష్ చెయ్యాలి.

**తారు మరక :**

మరకపడిన భాగాన్ని ఆలివ్ ఆయిలులో కొంతసేపు నానబెట్టి వేడినీటితో సోప్ వాష్ చేసి ఎండలో ఆరబెట్టాలి.

**లిప్‌స్టిక్ మరక :**

కార్బన్ టెట్రాక్లోరైడు అనే పదార్థంలో (బజార్లో అమ్ముతారు) దూదిని ముంచి మరకపై నెమ్మదిగా రుద్ది సోప్ వాష్ చెయ్యాలి.

**సిరా మరక :**

సిరా పడిన భాగాన్ని 'వినిగర్' లో నాననిచ్చి బాగుగా రుద్ది సోప్‌వాష్ చేసుకోవాలి. మరో పద్ధతి : మరకపడిన భాగాన్ని చన్నీటిలో ముంచి పాలతో మరకపై బాగా రుద్ది, సోపు వాష్ చేసినా కూడా యీ మరకలు పోతాయి.

**కాటుక మరక :**

మరక పడిన భాగాన్ని మొదట కొబ్బరి నూనెలో ముంచి వెంటనే సోపు వాష్ చేసుకోవాలి.

**బురద మరక :**

వర్షాకాలంలో బయటకు వెళ్ళినపుడు బట్టల మీద బురద దాగులు పడుతూ వుంటాయి. దాగు పడిన భాగాన్ని నీటిలో ముంచి అప్పుడే కోసిన బంగాళాదుంప ముక్కతో రుద్దితే దాగులు వెంటనే పోతాయి.

—అంగర శ్రీదేవి

'ఈ వారంది చదివిందో! లేదో! చదివేసే ఉంటుంది! ఇంక చదవదా? వచ్చి మూర్రోజు లవుతూంటే....ఇస్తే బావుణ్ను! ఊసుపోయి చావడం లేదు!' వరలక్ష్మి బుర్ర గోక్కుంది. 'పది గంటల దాకా యుద్ధమయింది! ఈ పనిదీ, పాలూ, నీళ్ళూ కావు గాని....నిష్ఠూర్యం వస్తూంది! బాబిగాణ్ణి పంపుదునా! నేనే వెళ్ళి అడుగుదునా?' అని ఆలోచించి బాబిగాణ్ణి పంపింది.

సత్యవతి మొగుణ్ణీ, చిన్నిగాణ్ణీ ఆఫీసుకీ స్కూలుకీ పంపించి, అన్నం తిని. సావట్లో పత్రిక పట్టుక్కూచుంది. చదివినదే! విసుగేసి వదేసింది. ఓసారలా తెల్పిన వాళ్ళింటికి వెళ్ళొద్దామా అంటే ఎండ మండిపోతోంది. ఈమధ్య వరలక్ష్మి డిటెక్టివులు కొట్టు మీంచి తెప్పించుకు చదువుతూంది. మొన్న ఇచ్చింది చాలా బావుంది సుమా! మరోటి అడగాలి అనుకుంది.

ఇంతలో వరలక్ష్మి కొడుకు వచ్చేడు పత్రిక పట్టుకుని. పత్రికిచ్చి 'మా అమ్మ కొత్తపుస్తకం తెమ్మంది' అన్నాడు బాబిగాడు. సత్యవతి వికసించిన మొహంతో పత్రిక వాడి చేతికిచ్చి 'పద' అంది వాణ్ణి. వెళ్ళి — 'పత్రికడిగారా?' అడిగింది.

'అదిగానండీ' కొత్త పత్రికను అంత మొహంతో అందుకొంది వరలక్ష్మి.

'మొన్న మీరిచ్చిన డిటెక్టివు చాలా బాగుందండీ!' అంది సత్యవతి. వరలక్ష్మి సంతోషంగా 'నాకూ చాలా నచ్చిందండీ! మరోటుంది. చదువుతారా?' అడిగింది.

'ఆఁ....ఇవ్వండి!'

డిటెక్టివు అట్ట మీది బొమ్మా పేరూ చూస్తూ సత్యవతి, వరలక్ష్మి ఏమైనా మాట్లాడుతుందేమోనని చూసింది. పత్రిక సీరియల్లో మునిగిపోబోతూ సత్యవతేమన్నా కబుర్లు చెబుతుందేమోనని చూసింది వరలక్ష్మి.

'పోన్లే! చదువుకుంటూంది కాబోలు! సాయంత్రం మాట్లాడుకోవచ్చు' అనుకున్నారిద్దరూ తక్కినవారి గురించి.

సాయంత్రం అరవుతోంటే డాబా మీదికి వచ్చింది సత్యవతి. 'అబ్బ! డిటెక్టివెంత బావుంది! ఆ హంతకుడు! వాడి దారుణం కాల్చా! మనుషుల్ని చంపడం వాడికి నల్లుల్ని నలిపినట్టుందేఁవో! ఎంత సస్పెన్సూ!' అనుకుంది.

వంటగదిలో పని త్వరగా తెముల్చుకుంటూంది వరలక్ష్మి. 'సీరియలు మాంచి రసకందాయమైన పట్టులో ఉండగా టకీమని ఆపేశాడు పత్రిక వాడు! మళ్ళా వచ్చేవారం దాకా నిరీక్షించడమంటే ఎంత బాధ? సునందిని సుబ్బారావ్‌ని కల్పుకుంటుందో? లేదో! ఇది సినిమా తీస్తే ఇంకెంత బావుంటుందో!' అనుకుంటూ మొహం కడుక్కుని, నీటుగా తయారై డాబా మీదికి పరుగెత్తింది.

హత్యలు — దారుణాలు — సస్పెన్సు — సీరియల్‌లో ప్రేమలు — ఎడబాట్లు — ప్రకృతి అందాలు — అక్కణ్ణించి సినిమా కబుర్లు — విమర్శలు—నవ్వులు—వరలక్ష్మి సత్యవతీ ప్రపంచాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నారు. చిట్టిగాడు బాబిగాడితో ఆడుకుంటున్నాడు.

ఆఫీసు నించి వస్తోన్న రామారావు, సత్యమూర్తి తమ డాబా మీద శాంతియుత వాతావరణాన్ని చూసి 'తెల్లారితే మళ్ళీ ఎలా ఉంటుందో' నని ఆశ్చర్యంతో నవ్వుకున్నారు. *